క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

పెనుగంచిప్రోలు: వైఎస్సార్ సీపీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం సాయంత్రం 4 గంటలకు మునేరు అవతల దేరంగుల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ పొన్నం కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు ఆళ్ల చెల్లారావు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి యువకులు, ముఖ్య కార్యకర్తలంతా తప్పక హాజరు కావాలని కోరారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రయోజనం



పెనుగంచిప్రోలు: కేంద్రం తెచ్చిన జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని ఎంపీడీఓ జి శ్రీను అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జీఎస్టీ సంస్కరణలపై సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరిట శుక్రవారం స్థానిక వ్యాపారస్తులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. గూడ్స్, సర్వీస్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్ ములాస్వామి, ఆఫీసర్ పి దుర్గాప్రసాద్, జీఎస్టీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సీహెచ్ రమేష్‌బాబు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుల వివరాలను తెలియజేశారు. అనంతరం వ్యాపార సంస్థల వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ కె సిద్ధారెడ్డి, డెప్యూటీ ఎంపీడీఓ కె.సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

కంచికచర్ల : స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని శ్రీబాల విఘ్నేశ్వర స్వామి ఆలయంలో కొత్తగా పాలకవర్గ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా రాయంభ శ్రీనివాసరావు, కార్యదర్శిగా మల్లాది బ్రహ్మానందరావు, కోశాధికారిగా మల్లాది పరమేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా సోమవరపు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి గుంటుపల్లి సత్యనారాయణ, సభ్యులుగా చాగుంటపాటి నాగ రాజు, గుంటుపల్లి నాగరాజు, గుండెమెడ హనుమంతరావు ఎన్నికయ్యారు. వీరిని ఆలయ అర్చకులు అభినందించారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ సమీపంలో ఈనెల 4వ తేదీ రాత్రి జరిగిన ఘర్షణ, దాడికి సంబంధించి ఇరు వర్గాలపై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..విజయవాడకు చెందిన యూట్యూబర్ రాజేంద్ర తన స్నేహితులతో కలిసి కారులో అమ్మవారి ఆలయానికి వస్తుండగా మార్గమధ్యంలో గ్రామానికి చెందిన ఓ బాలుడిని కారు ఢీకొట్టింది. ఈ ఘటనపై బాలుడి తండ్రి మల్లేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా యూట్యూబర్ రాజేంద్ర సైతం తన కారు ఆలయ సమీపంలో రాగా కొందరువ్యక్తులు దాడిచేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనలకు సంబంధించి య్యూటూబర్‌తోపాటు పెనుగంచిప్రోలుకు చెందిన ఎనిమిది మందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: గ్రామాల్లో వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. జుజ్జూరులోని రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆయన మండలంలోని వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామ స్థాయిలో పరిష్కారం కాని రెవెన్యూ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో లో ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం



కెఅగ్రహారం(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు పలు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోవిందన్, ఉపాధ్యాయులు ఉషాహరణి, రాజేంద్ర, నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రిక, ధనలక్ష్మి, బేబిరాణి, ఆశావర్కర్లు కమల, ఆదిలక్ష్మి, రజని తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో అందని ద్రాక్షలా వైద్య విద్య

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



నందిగామలో వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ప్రజాఉద్యమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ జగన్‌మోహనరావు, నాయకులు

నందిగామటౌన్: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే పేద విద్యార్థులకు వైద్యవిద్య అందని ద్రాక్షలా మారుతుందని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమంపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ప్రజాఉద్యమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో స్థాపించిన కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు పార్టీ తరఫున రచ్చబండ, ర్యాలీలు, సంతకాల సేకరణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

క్షీణించనున్న ప్రజారోగ్య వ్యవస్థ..

ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌పరం చేస్తే రూ. లక్ష కోట్ల విలువ చేసే ప్రజల ఆస్తులు ప్రైవేట్‌పరమవుతాయని జగన్‌మోహనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేట్ పరమైతే ప్రభుత్వ వైద్య కళాశాలల పేదలకు దూరమవుతాయన్నారు. వైద్య విద్య ఫీజులు భరించలేనంతగా పెరిగే పేదలకు వైద్యవిద్య దూరవుతుందని పేర్కొన్నారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి..

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే ఉప సంహరించుకోవాలని జగన్‌మోహనరావు డిమాండ్ చేశారు. ప్రజానిధులతో నిర్మించిన సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించి రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాయొద్దని కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు మహ్మద్ మస్తాన్, మంచాల చంద్రశేఖర్, కంచికచర్ల ఎంపీపీ మలక్ బషీర్, వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, మద్దుకూరి సాయిబాబు, చింతా రవీంద్రనాద్, బుడ్డి సత్యనారాయణ, చిలుకూరి బుచ్చిరెడ్డి, చాగంటి రవికిరణ్ రెడ్డి, నల్లమల్లి మురళి, పరిశా మల్లి, మువ్వల శ్రీను, మన్నెం దాసు, పిల్లి జయరాజు, మాడుగుల మనోహర్, పోతురాజు, సుభాని, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమ పోస్టర్లను స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజారోగ్య రంగాన్ని పూర్తిగా దెబ్బతీస్తోందన్నారు. పేదలకు వైద్యం అందకుండా కుట్ర చేస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రభుత్వ వైద్య రంగాన్ని సువర్ణాధ్యాయంగా మార్చారని గుర్తుచేశారు. రాష్ట్ర వందేళ్ల చరిత్రలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు కేవలం 12 మాత్రమే ఉండగా, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో 17మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రారంభించడంతోపాటు ఐదు కళాశాలలను ప్రారంభించారన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పూర్తయితే పేదలకు వైద్యవిద్య, వైద్యం పూర్తిగా దూరమవుతాయన్నారు.రూ.1లక్ష కోట్ల విలువ చేసే ప్రజల ఆస్తి ప్రైవేటుపరమవుతుందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 45 రోజుల పాటు ప్రజాఉద్యమం చేపడుతున్నట్లు వివరించారు. ఈ ఉద్యమంలో మేధావులు, ప్రజాసంఘాలు, యువత, విద్యార్థులతోపాటు ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం పునరాలోచన చేసి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాసగౌడ్, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి కన్నమాల శామ్యూల్, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శులు గొర్రెపాటి బుల్లియ్య, శీలం మంగారావు, జిల్లా రైతువిభాగం కార్యదర్శి మోరె దుర్గాప్రసాద్, జిల్లా మైనార్టీ కార్యవర్గ సభ్యులు షేక్ ఖాదర్ బాబు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు చల్లా సుశీల, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు ఓర్సు రాజు, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు బాణావత్ రాజు ఆయా విభాగాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పేటలో కోటి సంతకాల ప్రజాఉద్యమం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

భద్రతా ప్రమాణాలపై అధికారులకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామరూరల్: దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తిగలవారు ఈనెల 16వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో బాలకృష్ణ సూచించారు. బాణసంచా దుకాణాల ఏర్పాటుకు లైసెన్స్‌ల మంజూరు, భద్రతా ప్రమాణాలకు సంబంధించి తన కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ బాణసంచా దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన భద్రతా నిబంధనలు, అగ్నిమాపక జాగ్రత్తలు, విద్యుత్ భద్రతా ప్రమాణాలు, ప్రజారక్షణ చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనుమతులు తీసుకోకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏసీపీ తిలక్, డివిజన్‌లోని తహసీల్దార్లు పోలీసు, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్ శాఖాధికారులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వేల్పుల రమేష్

కంచికచర్ల : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటు పరం చేస్తున్న సీఎం చంద్రబాబుకు బుద్ధివచ్చేలా వైఎస్సార్ సీపీ చేపట్టే కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి వేల్పుల రమేష్ కోరారు. కీసరలోని స్వగృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనహయాంలో విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేయగా, కూటమి ప్రభుత్వం విద్య, వైద్యరంగాలను ప్రైవేట్ పరం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు వైఎస్సార్ సీపీ నందిగామ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ సారథ్యంలో నియోజకవర్గంలోని కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు, ప్రజలంతా ఈ ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిలు చెల్లించకుండా సీఎం చంద్రబాబు ఆరోగ్యశ్రీ పథకానికి కూడా తూట్లు పొడిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రవేటు పరం కాకుండా చూడాలని రమేష్ డిమాండ్ చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ర్యాలీలో పాల్గొన్న ప్రసూన, భరద్వాజ్, విద్యార్థులు

మక్కపేట(వత్సవాయి): ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వి.ప్రసూన సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మక్కపేట గ్రామస్తులకు శుక్రవారం వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నివాసప్రాంతాలలో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులలో పదార్థాలను తినకూడదని వివరించారు.కార్యక్రమంలో జెడ్పీ హెచ్ఎం సీహెచ్ వెంకటేశ్వర్లు, తిరుమలగిరి ఆలయ చైర్మన్ కేఆర్ భరద్వాజ్, సాయిసెంచరీ, ఎంఆర్‌టీ కళాశాల ప్రిన్సిపాల్‌లు కె.సవిత, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



నందిగామ ప్రభుత్వాస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న జడ్జి షేక్ రియాజ్



మాట్లాడుతున్న జడ్జి హిమబిందు

నందిగామరూరల్: పౌష్టికాహారం తీసుకోవటంతో పాటు ఆరోగ్య మెలకువలు పాటిస్తే అనారోగ్య సమస్యలు దరి చేరవని నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో వరల్డ్ మెంటల్ హెల్త్ డే సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు ఆరోగ్య అవగాహన కల్పించారు. తొలుత ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జడ్జి రియాజ్ మాట్లాడుతూ ప్రస్తుత హడావిడి జీవనంలో ప్రతిఒక్కరికి మానసిక ప్రశాంతత అవసరమన్నారు. ముఖ్యంగా ఉద్యోగాలు, పనులు, ఇతరత్రా కారణాలతో ఎక్కువ శాతం మంది ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తున్నారని.. ఇది మంచి పద్ధతి కాదన్నారు. నిత్యం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు, కూరగాయలు, గుడ్లు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్, న్యాయవాదులు అద్దంకి మణిబాబు, మాడుగుల స్టాలిన్, షేక్ ఆజాద్, ఎక్కిరాల హనుమంతరావు, కొమ్మినేని మౌలేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు...

జగ్గయ్యపేటఅర్బన్: వరల్డ్ మెంటల్ హెల్త్ డే ను పురస్కరించుకుని జగ్గయ్యపేట మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు హాజరై రోగులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయ సేవలు కోర్టు ద్వారా ఎలా పొందాలి అనే అంశంపై సూచనలు చేశారు. అనంతరం ఇన్‌పేషంట్లుగా ఉన్న వారిని పరామర్శించి వారికి అందుతున్న వైద్యసేవల వివరాలు తెలుసుకోవడంతో వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ సెక్రటరీ మెట్టెల ఆంజనేయులు, ఉపాధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, హాస్పిటల్ సూపరిండింటెంట్ డాక్టర్ హరికృష్ణ, వైద్యులు హరీష్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డేటా అనలిటిక్స్ రంగంలో అపార అవకాశాలు

మైలవరం: డేటా అనలిటిక్స్ రంగంలో అపార అవకాశాలు ఉంటాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డేటా అనలిటిక్స్ యూజింగ్ అడ్వాన్స్ ఎక్సెల్ అండ్ పవర్ బీఐ సర్టిఫికెట్ కోర్సు శుక్రవారం ముగిసింది. కోర్సు కన్వీనర్ డాక్టర్ ఎన్. వెంకటాద్రి బి.సుభాషిణి, ఫిజికల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ ఉమాలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామరూరల్: పట్టణంలోని 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా నందిగామ పట్టణంతోపాటు చందాపురం, ఐతవరం, అంబారుపేట గ్రామాలలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆస్పత్రి కోసం స్థల పరిశీలన

నందిగామరూరల్: ఆయుష్ ఆస్పత్రి నిర్మాణం కోసం పట్టణంలోని హనుమంతపాలెం గ్రామసమీపంలో అందుబాటులో ఉన్న స్థలాలను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్ హాస్పిటల్ భవిష్యత్ ఆరోగ్య సేవల అభివృద్ధికి కీలక అడుగుగా మారుతుందని పేర్కొన్నారు. ఈ ఆస్పత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటానని వివరించారు. ఆమె వెంట ఆర్డీవో బాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు, ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

ఆర్పీలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

నందిగామటౌన్: అర్హులైన ప్రతిఒక్క దరఖాస్తుదారునికి జీవనోపాధి కల్పించాలని మున్సిపల్ కమిషనర్ లోవరాజు మెప్మా ఆర్పీలకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో చేపడుతున్న జీవనోపాధి యూనిట్ల కరపత్రాలను మెప్మా ఆర్పీలకు శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిష్పక్షపాతంగా నడుచుకుంటూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి జీవనోపాధి కల్పించాలని సూచించారు. మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై పోలీసులకు ఫిర్యాదు

నందిగామరూరల్: సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాది రవికిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు షేక్ ఆజాద్, ఎక్కిరాల హనుమంతరావు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టులో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి న్యాయమూర్తికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ నందిగామకు చెందిన పలువురు న్యాయవాదులు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించటం హేయమైన చర్యన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు కస్తాల నూతన్, చరణ్, దున్నా కోటేశ్వరరావు, వీరబాబు, అరుణ్‌కుమార్, గోపి పాల్గొన్నారు.

జీఎస్టీ ఎగ్జిబిషన్ ప్రారంభం



జీఎస్టీ తగ్గింపు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్, అధికారులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని సీతారామపురంలోని కొత్త వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జీఎస్టీ ఎగ్జిబిషన్-ఎలక్ట్రానిక్స్ మేళా అండ్ స్మార్ట్ బజారును ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, పేట ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న పేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

వత్సవాయి: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సూచించారు. వత్సవాయిలోని జెడ్పీ పాఠశాలలోని ఉపాధ్యాయులు కాకాని శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, పులి శ్రీనివాసరావు కలిసి మొత్తం 110మంది పదోతరగతి విద్యార్థులకు సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతశిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు ఆటలపోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్.నాగరాజు, హెచ్ఎం అనితశ్రీ, మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, చిట్టూరి రమేష్, సొసైటీ అధ్యక్షులు నెల్లూరి శ్రీను పాఠశాల స్టాఫ్ సెక్రటరీ అద్దంకి సుధాకర్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ



రైతులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న వన్నూరప్ప

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): అవినీతిని అరికట్టేందుకు సమాచార హక్కు చట్టం ఒక శక్తివంతమైన ఆయుధమని ప్రకృతి వ్యవసాయం డివిజన్ మాస్టర్ ట్రైనర్ వన్నూరప్ప అన్నారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో శుక్రవారం అవగాహనా సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల ద్వారా సేకరించిన ప్రభుత్వ ధనంపై లెక్కలు తెలుసుకునే హక్కు పౌరులకు ఉందన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం వస్తుందని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాజశ్రీ, రైతులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ టూర్‌కు కంభంపాడు విద్యార్థులు



కంభంపాడు(వత్సవాయి): ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులు శుక్రవారం జగ్గయ్యపేటలోని మండవ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించారు. ఆ కళాశాలలోని మెకానికల్, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ల్యాబ్‌లను సందర్శించారు. ఆయా విభాగాల ప్రొఫెసర్లు విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థులు ఇందు టెక్స్‌టైల్స్ పరిశ్రమ సందర్శించారు. పత్తి నుంచి దారం తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వీవీఆర్, ఉపాధ్యాయులు ఎం.లలితజ్యోతి, ఒకేషనల్ ట్రైనర్ జి.త్రిలోక్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమశాఖ ఇంటిగ్రిటీ బాలికల హాస్టల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ సమీపంలోని ఆర్‌కే మెడిస్ లేబొరేటరీస్ ఆర్థిక సహకారంతో రూ 1.50 లక్షలతో 500 లీటర్ల సామర్థ్యంగల వాటర్‌ప్లాంటును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దూళిపాళ్ల లక్ష్మణరావు, కౌన్సిలర్ కంచేటి గీతారాణి, వేదాద్రి సర్పంచ్ గుడారు పేరయ్య, వార్డెన్ సుల్తానా, ఆర్‌కే మెడిస్ లేబొరేటరీస్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు గగన్‌శ్రీ ఎంపిక

ఇబ్రహీంపట్నం: జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఇబ్రహీంపట్నంలోని జాకీర్ హుస్సేన్ కళాశాలకు చెందిన కోలపనేని గగన్‌శ్రీ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ సాదిక్ తెలిపారు. ఈనెల 4 నుంచి 7 వరకు అనంతపురంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ అండర్ 17 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించిందన్నారు.ప్రతిభ చాటిన ఆమెను ఒడిశాలో డిసెంబర్ నెలలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని చెప్పారు. ఆమెను కళాశాల కరస్పాండెంట్ నజీఫ్ పాషా, మస్తాన్ వలి అభినందించారు.